క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా టీమ్ సభ్యులు అస్లం, బాలయ్య, సబ్ యూనిట్ అధికారి సాయిబాబా సూచించారు. బుధవారం మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో జిల్లా మలేరియా టీమ్ సభ్యులు పర్యటించారు. వారు మాట్లాడుతూ పిల్లిగుండ్ల గ్రామంలో వారం రోజుల క్రితం డెంగీ కేసులు నమోదయ్యాయి. కేసులు నమోదైన వారి ప్రాంతాల్లో దోమలను పట్టి పరిశీలించి, వాటి నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే ఆయా కాలనీలలో దోమల మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ శ్రీధర్ రెడ్డి, సుధాకర్, కరుణానిధి, సూపర్‌వైజర్లు హనుమంతు, పరమేష్, ఎంఎల్‌హెచ్‌పీ అనిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక


సుమాంజలితో ప్రిన్సిపాల్ చైతన్య ప్రవంతి

కృష్ణగిరి: కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ బైపీసీ సెకండ్ ఇయర్ చదువుతున్న సుమాంజలి జాతీయ స్థాయి సీనియర్ నెట్ బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ చైతన్య ప్రవంతి బుధవారం తెలిపారు. కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావ డం జరిగిందన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు హర్యానా రాష్ట్రంలోని సోనేపట్‌లో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుప్రియను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న గైనకాలజిస్ట్ గీతావాణి

ఆలూరు రూరల్: గర్భిణులు రక్తహీనత రాకుండా చూసుకోవాలని గైనకాలజిస్ట్ గీతావాణి అన్నారు. బుధవారం ఆమె ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. గర్భందాల్చిన నాటి నుంచి ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.ప్రతి నెల 9వ తేదీ ఆసుపత్రిలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలతో పాటు రోజు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


సలావుద్దీన్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ ఈరన్న, ఉపాధ్యాయులు

హాలహర్వి : మండలంలోని బిలేహాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సలావుద్దీన్ ఈనెల 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక పాఠశాలలో ఎంఈఓ ఈరన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉలియ్య, ఉపాధ్యాయులు అవార్డు గ్రహీత సలావుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ విధులపట్ల అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దే ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ అవార్డును పొందినట్లేనని చెప్పారు.

చురుగ్గా సురక్ష సర్వే

ఆలూరు రూరల్: ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే మండలంలో చురుగ్గా సాగుతోంది. ఏఎన్ఎంలు, ఆశాలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. బుధవారం ఆలూరు సచివాలయం-3 పరిధిలో సర్వే చేపట్టారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్లు అవసరమయ్యే రోగుల వివరాలు సేకరించారు.

పుట్లూరులో క్రికెట్ పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో మాతా మారెమ్మ ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 25 జట్లు పాల్గొనగా, మొదటి రోజు వెల్దుర్తి జట్టుపై రామకృష్ణాపురం జట్టు గెలుపొందింది. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.12వేలు, రూ. 6వేలను అందజేయనున్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

కృష్ణగిరి: మండలంలోని పోతుగల్లు గ్రామానికి చెందిన బోయ దూపాటి ఎర్రమల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మృతునికి భార్య ఆదిలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10వేలను సచివాలయ కన్వీనర్ తెలుగు వెంకటేష్, బేతాపల్లె సుధాకర్, వేల్ఫేర్ అసిస్టెంట్ వెంకటస్వామితో కలిసి అందజేశారు.


బాపురం ఎల్లెల్సీ కాలువలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

హొళగుందలో వినాయక విగ్రహాల ఊరేగింపు



హొళగుంద: మండలంలో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మండల కేంద్రం హొళగుందలో 27 విగ్రహాలతో కలిపి ఆయా గ్రామాల్లో సుమారు 91 వినాయక విగ్రహాలు కొలువు దీరాయి. మేళ తాళాలతో భారీ ఊరేగింపు మధ్య తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ), చెరువులు, బావుల్లో నిమజ్జనం చేశారు.

నిమజ్జనం.. శోభాయమానం

దండాలయ్యా..ఉండ్రాలయ్యా..

ఆలూరు: నియోజకవర్గం కేంద్రమైన ఆలూరులో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి హాలహర్వి మండలం బాపురం గ్రామ ఎల్లెల్సీ కాలువకు తీసుకెళ్లారు. నిమజ్జన వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, ఎంపీపీ రంగమ్మ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలూరు రూరల్ : మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను భక్తులు దండాలయ్యా..ఉండ్రాలయ్యా అంటూ.. బుధవారం గంగమ్మ ఒడిలోకి చేర్చారు. ఆలూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకులను పూజలు చేసి అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.


కొండవీటి ప్రాంతంలో దివ్యాంగ పిల్లలకు నగదు అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడిని బుధవారం స్థానిక ఎల్లెల్సీ కాలువలో నిమజ్జనం చేశారు. మూడవ రోజున ఆయా వినాయల మండళ్ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమాలు చేపట్టిన అనంతరం గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్థానిక కొండవీటి ప్రాంత వినాయకమండలి సభ్యుడు తెలుగు రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు చీరలను, భవిత కేంద్ర దివ్యాంగులకు రూ.10వేలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు.

నందవరం : మండలంలో మూడు రోజుల పాటు విశేష పూజలందుకున్న పార్వతీ తనయుడు గణేశుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా గణేశ్ నిమజ్జనోత్సవం ఘనంగా జరిగాయి. మండలంలోని నదికై రవాడి, గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి, ఇబ్రహీంపురం, మాచాపురం, హాలహర్వి గ్రామాల్లో వినాయకులను తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను నిబంధనలు పాటిస్తూ వాహనాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గోనెగండ్ల, రాళ్లదొడ్డి, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, పిల్లిగుండ్ల, ఒంటేడుదిన్నె, నెరుడుప్పల విగ్రహాలను గాజులదిన్నె ప్రాజెక్ట్‌లో నిమజ్జనం చేశారు.

తుగ్గలి : జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై..గణపతి బప్ప మోరియా..అంటూ యువకుల కేరింతలతో గణేష్ శోభాయాత్ర సాగింది. ఊరూరా కొలువుదీరిన గణనాథులు పూజలు, నైవేద్యాలు అందుకున్నారు. గంగ ఒడికి గౌరీ తనయుడిని చేర్చి బైబై చెప్పారు. పగిడిరాయి ఆంజినేయస్వామి గుడి వద్ద చాకలి రాధాకృష్ణ రూ.65 వేలకు లడ్డూ దక్కించుకోగా, బోడబండ గేరిలో యంగటయ్య అనే భక్తుడు రూ.45వేలకు వేలం పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు.

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలో వినాయకచవిత సందర్భంగా కొలువుతీరిన వినాయకులను బుధవారం భక్తులు ఘనంగా నిమజ్జోనోత్సవం నిర్వహించారు. యువకులు రంగులు చల్లుకుంటూ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. సమీపంలోని హంద్రీనీవా కాలువలో ప్రతిమను నిమజ్జనం చేశారు.

గోవర్ధనగిరిలో రికార్డు స్థాయిలో లడ్డూ వేలాలు

వెల్దుర్తి: మండల కేంద్రం మినహా మండల పరిధిలోని 40 గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. దాదాపుగా 49 విగ్రహాలు ఆయా గ్రామాల సమీప కుంటలు, వాగులు, చెరువులలో నిర్వాహకులు నిమజ్జనం చేశారు. కాగా, గోవర్ధనగిరి గ్రామంలోని వినాయక విగ్రహాల ప్రసాద లడ్డూలు ఎప్పటి కంటే అధిక వేలంతో రికార్డు ధర పలికాయి. పోటాపోటీగా జరిగిన వేలాలలో గ్రామ నడిబొడ్డున గుండం బయలులో కొలవైన గణనాథుని లడ్డూను గ్రామానికే చెందిన దళవాయి లక్ష్మన్న రూ.81,000లకు దక్కించుకున్నాడు. తెలుగు వీధిలోని స్వామి వారి చేతిలోని ప్రసాద లడ్డూను చిన్ననాగి రూ.61,500లకు, అదే వీధిలోని మరో వినాయక లడ్డూను మరొకరు రూ.35వేలకు దక్కించుకున్నారు.


గోవర్ధనగిరిలో గణనాథుని లడ్డూను రూ.81వేలను దక్కించుకున్న దళవాయి లక్ష్మన్న

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం గణనాథులను గ్రామ వీధుల గుండా ఊరేగించి నిమజ్జనం చేశారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయా గ్రామాల శివారులోని హంద్రీనీవా కాలువ, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కంబాలపాడు గ్రామంలో ఊరేగింపు సందర్భంగా హస్టల్ విద్యార్థులను తీసుకరావడంతో ఎస్ఐ సురేష్ విషయాన్ని తెలుసుకుని విద్యార్థులను తిరిగి పంపించేశారు.

పత్తికొండ రూరల్ : మండలంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 175 విగ్రహాలను ఏర్పాటు చేయగా హంద్రీనీవా కాలువ ఘాట్ వద్ద నిమజ్జనం చేశారు.

దేవనకొండ : మూడు రోజులుగా వాడవాడలా కొలువుదీరిన గణనాథులను బుధవారం నిమజ్జనానికి తరలించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి గణనాథులను దగ్గరలోని చెరువులు, బావులు, కాలువల్లో నిమజ్జనం చేశారు.

ఆస్పరి: మండలంలోని గ్రామాలలో ఘనంగా గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పరిలో ఎద్దుల బండిపై గణనాథుని ఊరేగింపు ఆకట్టుకుంది.

హాలహర్వి : మండలకేంద్రమైన హాలహర్వితో పాటు పలు గ్రామాల్లో గణనాథులను బుధవారం సాయంత్రం నుంచి నిమజ్జనానికి తరలించారు. బాపురం, చింతకుం ఎల్లెల్సీ కాలువల వద్ద గణనాథులను నిమజ్జనం చేశారు.


జోహరాపురంలో నిమజ్జనోత్సవం


గోనెగండ్లలో హారతులతో వెళ్తున్న చిన్నారులు


హొళగుందలో వినాయకుడి పక్కనే గాంధీ వేషధారి


నిమజ్జనానికి వెళ్తున్న కోయనగర్ గణనాథుడు


ఎమ్మిగనూరు ఎస్ఎంటీ కాలనీ వద్ద పూజలందుకున్న గణనాథుడు


ఎరుకలచెరువులో పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


పత్తికొండలో గణనాథుల శోభాయాత్ర


హొళగుందలో మజ్జిగ బండి వేషధారులు


పగిడిరాయిలో రూ.45వేలకు లడ్డూను దక్కించుకున్న యాగంటయ్య

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే భవిష్యత్‌కు ఉపయోగపడతాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 14సంవత్సరాల నుండి 17 సంవత్సరాల్లోపు బాలబాలికలకు నియోజవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను డీఎస్పీ సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ ఆంజినేయులుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభను చాటి జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కొలువుల్లో స్పోర్ట్స్ కోటా కింద రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని గుర్తు చేశారు. డీఎస్పీ, కమిషనర్, తహసీల్దార్ విద్యార్థినులకు సూచనలు ఇచ్చారు. అనంతరం ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా ఎన్నికైన స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాల పీడీ సుజనకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఎంఈఓ ఆంజినేయులు, హెచ్ఎం కేఈ చిత్రలేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు, బుట్టారంగయ్య, ఎంకే శివప్రసాద్, రిటైర్డ్ పీఈటీ సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచాలి


ఎమ్మిగనూరు సెబ్ కార్యాలయం తనిఖీ చేసిన సెబ్ డిప్యూటీ కమీషనర్ నాగమద్దయ్య

ఎమ్మిగనూరురూరల్: రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల్లో నిరంతరం నిఘా పెంచాలని విజయవాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ బ్యూరో నాగమద్దయ్య పేర్కొన్నారు. బుధవారం ఎమ్మిగనూరు సెబ్ కార్యాలయం పరిధిలోని మాదవరం చెక్ పోస్టును డిప్యూటీ కమీషనర్ తనిఖీ చేశారు. సాయంత్రం ఎమ్మిగనూరు సెబ్ కార్యాలయాన్ని సదర్శించారు. ఎన్నికేసులు నమోదు అయ్యాయి, పట్టుబడిన మద్యం, వాహనాల సీజ్ తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్ పోస్టుల దగ్గర అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, ఇతర మారకద్రవ్యాలు అక్రమంగా రాష్ట్రంలోకి రవాణా చేసే అక్రమార్కులపై నిఘా ఉంచాలన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణాపై గట్టి నిఘా ఉంచాలని, నదీతీర ప్రాంతాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెబ్ సీఐలు జయరాం నాయుడు, రాజశేఖర్‌గౌడ్, ఎస్ఐ సోమశేఖర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

30 లోపు పంట నమోదు చేయించుకోవాలి

గోనెగండ్ల : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు ఈనెల 30వ తేదీ లోపు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. బుధవారం వారు మండలంలోని నెరుడుప్పల, ఎర్రబాడు, కన్నూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సిబ్బందిని సంప్రదించి తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పంటపొలాల్లో ఆర్బీకే సిబ్బంది చేస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.


పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ ఖాద్రీ

బస్సు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మిగనూరుటౌన్: మెప్మా సమావేశానికి విజయవాడకు వెళ్తూ వినుగొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పట్టణ మెప్మా సమాఖ్య సభ్యులు హేమలత, గంగతో పాటు మరో ఇద్దరిని బుధవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నరసరావుపేటలో పరామర్శించారు. గాయపడ్డ హేమలతకు మెరుగైన చికిత్స అందించాలని అక్కడి వైద్యులను సూచించారు.


గాయాలపాలైన హేమలతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మద్దికెర : రైతు క్షేమంగా వున్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా వుంటుందని, రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మద్దికెరలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 77 చెరువులకు రూ.225 కోట్లతో నీరు ఇవ్వడం సంతోషకర విషయమన్నారు. సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. గత ప్రభుత్వంలో పథకాలకు రాళ్లు నాటి వెళ్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. రాష్ట్రంలో ఒక్కొక్కటిగా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడమే గాకుండా ప్రజల సంక్షేమం పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. సీఎం వస్తున్నారని చెరువులకు నీళ్లు వదలుతున్నారని తెలుసుకున్న రైతులు, ప్రజలు చూడడానికి పెద్ద ఎత్తున తరలి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, పత్తికొండ మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మొబైల్ వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రవాస భారతీయుల సేవలు మరువలేనివి

ప్రవాస భారతీయుల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మద్దికెరలోని ఫ్రెండ్స్ విద్యానికేతన్ హైస్కూలులో అర్ధగేరి రామకృష్ణారెడ్డి, రుక్మిణమ్మ జ్ఞాపకార్థం ప్రవాస భారతీయులు డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి, డాక్టర్ వెంకమ్మరెడ్డి చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వారిచే 9 రోజుల పాటు నిర్వహించే మొబైల్ ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రవాస భారతీయులు గతంలో కూడా గ్రామానికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. రోడ్లు, హాస్టల్, కమ్యూనిటీ హాలులో డైనింగ్ హాలుకు తమ వంతు సహకారం అందించారని గుర్తు చేశారు. అంతేగాక గ్రామానికి హంద్రీనీవా కాలువ నుంచి నీటిని పంపింగ్ చేయడానికి విద్యుత్ కనెక్షన్ కొరకు రూ.3 లక్షలు చెల్లించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరెడ్డి, శంకర్ నేత్రాలయ సీఈఓ అరుణ్‌కుమార్, ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, స్కూల్ కరస్పాండెంట్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తుగ్గలి : జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రతతో పాటు, కనీస వేతనం ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజునాయక్‌తో కలిసి వారు తుగ్గలిలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు సుంకన్న, చిరంజీవి, రామునాయక్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ఆలూరు: హెచ్ఎల్లెల్సీ కాలువ సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హెచ్ఎల్లెల్సీ డీఈ మంజునాథ్‌గౌడు తెలిపారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. నాన్‌ఆయకట్టు సాగుకు రైతులు సాగునీటిని వాడుకునే అంశంపై ఏఈ తిమ్మారెడ్డి పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలో ఆయకట్టు, నాన్‌ఆయకట్టును పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.

జయప్రదం చేయండి

నందవరం: ఈ నెల 25న బాపట్లలో సాగు భూములు, ఉపాధి, సామాజిక న్యాయం నినాదంతో నిర్వహించనున్న కూలిదండు మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సోమేశ్వరెడ్డి, మండల అధ్యక్షుడు గిడ్డయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో కూలిదండు మహా ప్రదర్శన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు భీమన్న, విరుపాక్షినాయుడు, లక్ష్మన్న, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించాలని ఆలూరు ఏఈ లోకేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను మార్చేందుకు ప్రతిపాదనలు పంపించామని.. త్వరలో వాటిని మార్చేస్తామన్నారు. గృహ, గృహేతర విద్యుత్ కనెక్షన్ల పెండింగ్ బకాయిలపై దృష్టి సారించి వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే ఫోన్ 9440813390 కు కాల్ చేసి తన దృష్టికి తీసుకురావాలన్నారు.


26న రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

వెల్దుర్తి: భగవాన్ సత్య సాయిబాబ సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 26న మండల కేంద్రం వెల్దుర్తిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో రాష్ట్రస్థాయి వ్యాస రచనా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు జి సాయిబాబ తెలిపారు. బుధవారం స్థానిక సత్య సాయి భజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు తిరివీధి సాయిప్రసాద్, ఒంగోలు సాయిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులకు 'ప్రకృతియే ఉత్తమ గురువు' అంశంపై, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'ఆచార్య దేవో భవ' అంశంపై వ్యాస రచన పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని దూదేకొండ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పత్తికొండకు చెందిన కట్టెల డిపో సుబాన్ కొడుకు గఫూర్ తీవ్రంగా గాయపడ్డాడు. దూదేకొండ నుంచి పత్తికొండ వైపునకు వస్తున్న బెలోరో వాహనానికి అడ్డుగా వెళ్లిన సుబాన్ బైక్‌ను వేగంగా ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. గాయపడిన సుబాన్‌ను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నందవరం :మండల పరిధిలోని కనకవీడు గ్రామానికి చెందిన జెడ్పీ పాఠశాల విద్యార్థులు బుధవారం నియోజవర్గ స్కూల్‌గేమ్స్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం గౌరమ్మ తెలిపారు. అండర్-17 కబడ్డీ పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు (బాలురు) బి. శివ, బి. దస్తగిరి, బాలికల విభాగంలో స్వాతి, షాహిన్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే అండర్-14 బాలికల విభాగంలో అనసూయ, రూప, పల్లవి, బాలుర విభాగంలోని యోగాలో వీరబాబు ఉత్తమ ప్రతిభ చూపారు. విద్యార్థులను పీడీ ఈరన్న, హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.